క్లుప్తంగా

వరద బాధితులకు రూ.50,000 విరాళం



కలెక్టర్ మహేష్‌కుమార్‌కు చెక్కు అందజేస్తున్న ఆజాద్ ఫౌండేషన్ సభ్యులు

అమలాపురం రూరల్: విజయవాడ వరద బాధితుల కోసం సీఎం సహాయనిధికి అమలాపురం ఆజాద్ ఫౌండేషన్ రూ.50,000 విరాళంగా ఇచ్చారు. ఆజాద్ ఫౌండేషన్ అధ్యక్షుడు యల్లమిల్లి నాగసుధా కొండలరావు(కొండ) చెక్కును కలెక్టరేట్‌లో కలెక్టర్ మహేష్‌కుమార్‌కు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆజాద్ ఫౌండేషన్ సభ్యులను కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో అడ్డాల గోపాలకృష్ణ, రంకిరెడ్డి కాశీవిశ్వనాథ్, ఆకెళ్ల నారాయణమూర్తి, వంటెద్దు బాబి, నిమ్మకాయల సుబ్బారావు, రాకూర్తి పట్టాభి రామయ్య, అడబాల బుజ్జి, కొత్తపల్లి వంశీ తదితరులు పాల్గొన్నారు.

ఈదురుగాలులకు కుప్పకూలిన చెట్టు



ఎంపీడీఓ కార్యాలయంలో కూలిన చెట్టును తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

తాళ్లరేవు: గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు, ఈదురు గాలులకు మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో ఉన్న భారీ చెట్టు కుప్పకూలింది. మండల పరిషత్ ప్రవేశ ద్వారానికి అడ్డుగా పడిపోవడంతో కార్యాలయంలోకి వెళ్లేవారికి ఇబ్బందిగా మారింది. ఈ నేపథ్యంలో ఎంపీడీఓ ఎం.అనుపమ ఆదేశాల మేరకు తాళ్లరేవు సర్పంచ్ రెడ్డి అరుణ సుహాసినీదేవి పర్యవేక్షణలో పంచాయతీ సిబ్బంది ఆ చెట్టును తొలగించారు.

ఉచిత వైద్య శిబిరం



ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి

అమలాపురం టౌన్: అమలాపురం ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక గడియారం స్తంభం సెంటరులో ఉచిత షుగర్, బీపీ పరీక్షల శిబిరం బుధవారం జరిగింది. ఈ వైద్య శిబిరాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి ప్రారంభించారు. అమలాపురం మెడ్ యునైటెడ్ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది శిబిరంలో వైద్య సేవలు అందించారు. పట్టణంలోని సీనియర్ సిటిజన్స్‌తో పాటు గడియారం స్తంభం సెంటరులో ఉన్న పట్టణ పోలీస్‌స్టేషన్ సిబ్బంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు యర్రమిల్లి విశ్వేశ్వరరావు, కార్యదర్శి అప్పన హరిశివప్రసాద్, కోశాధికారి నూలు సూర్యప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

27న పి.గన్నవరంలో జాబ్ మేళా

అమలాపురం రూరల్: జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో పి.గన్నవరం డిగ్రీ కళాశాలలో 27వ తేదీన జాబ్ మేళా నిర్వహించనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.లోకేమాన్ తెలిపారు. ఈ మేళాలో 17 ప్రముఖ ప్రైవేట్ కంపెనీల్లో పనిచేయుటకు 900 ఉద్యోగావకాశాలు ఉన్నాయన్నారు. ఈ కంపెనీల్లో రూ.10,000 నుంచి రూ.25,000 వరకూ జీతం ఇస్తారన్నారు. 10వ తరగతి, ఐటీఐ, ఇంటర్, డిగ్రీ, బీటెక్, బీఫార్మసీ, పీజీ, బీఎస్సీ నర్సింగ్, బీడీఎం చదివినవారు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 97039 66340, 82476 45389 సెల్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

జనిపెల్ల న్యూకాలనీకి రోడ్డు నిర్మించండి



ఎమ్మెల్యే ఆనందరావుకు సమస్యలు తెలుపుతున్న కాలనీవాసులు

అమలాపురం రూరల్: జనిపెల్ల న్యూకాలనీకి రోడ్డు, మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ ఎమ్మెల్యే ఆనందరావుకు బహుజన్ సమాజ్ పార్టీ అమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాలమూరి మోహన్‌బాబు ఆధ్వర్యంలో కాలనీవాసులు బుధవారం మొరపెట్టుకున్నారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ కచ్చితంగా రోడ్డు నిర్మిస్తామని, మౌలిక సదుపాయాలు కలిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీవాసులు నామగిరి రాజు, వర్రే రాజు, గుగ్గిళ్ల కుమార్, గౌతమ్, భరత్, సత్తి శ్రీధర్, లావణ్య లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అటూ ఇటూ తుప్పలు.. ప్రజలకు తిప్పలు

- ప్రమాదాల బారిన పడుతున్న వాహన చోదకులు
- తొలగించాలని కోరుతున్న స్థానికులు



తుప్పలతో ప్రమాదకరంగా ఉన్న గౌతమి గోదావరి ఏటిగట్టు రహదారి



గాడిమొగ రహదారిలో ప్రమాదకరంగా పెరిగిపోయిన తుప్పలు

తాళ్లరేవు: నియోజకవర్గంలోని పలు రహదారుల్లో రహదారుల చెంతన తుప్పలు పెరిగిపోవడంతో ప్రజలు తిప్పలు పడుతున్నారు. వర్షాకాలం కావడంతో రహదారుల చెంతన ఉండే చిన్నచిన్న మొక్కలు, పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగిపోయి రహదారిపైకి వచ్చేస్తున్నాయి. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనబడక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మండల పరిధిలోని గౌతమి గోదావరి చెంతనగల ఏటిగట్టు రహదారి వెంబడి పలుచోట్ల తుప్పలు బాగా పెరిగిపోయి రహదారిని కమ్మేస్తున్నాయి. ఇటు కేంద్రపాలిత ప్రాంతమైన యానాం నుంచి అటు కోటిపల్లి, రావులపాలెం వెళ్లేందుకు దగ్గర దారి కావడంతో అధిక శాతం మంది వాహనచోదకులు ఈ రహదారిలో ప్రయాణిస్తూ ఉంటారు. రహదారి బావుండటంతో వాహనాలు అత్యంత వేగంగా సంచరిస్తూ ఉంటాయి. అయితే తుప్పల కారణంగా వాహన చోదకులకు ఎదురుగా వచ్చే వాహనాల జాడ తెలియకపోవడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. గోదావరి ఏటిగట్టు కావడంతో ఏదైనా ప్రమాదం సంభవిస్తే సుమారు 10 అడుగుల పైనుంచి అటు గోదావరిలో గాని, ఇటు పంట కాలువలోగాని పడిపోతున్నారు. గతంలో ఈ రహదారిలో జరిగిన ప్రమాదాల్లో పలువురు మృత్యువాత పడగా అనేక మంది గాయాలపాలయ్యారు.

ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక

మండల పరిధిలోని పి.మల్లవరం పంచాయతీ ప్రత్తిగొంది నుంచి గాడిమొగ, రాంజీనగర్, గ్రాంటు, బాబానగర్ వెళ్లే రహదారుల్లో సైతం పలుచోట్ల తుప్పలు పెరిగిపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు, అలాగే పోలేకుర్రు పంచాయతీలోని తోటపేట రహదారి, అలాగే జి.వేమవరం, చొల్లంగిపేట, పటవల, కోరంగి తాళ్లరేవు, నీలపల్లి తదితర పంచాయతీల్లోని పలు రహదారుల చెంతన తుప్పలు పెరిగిపోవడంతో ప్రమాదాలు పెరిగాయి. ముఖ్యంగా రాత్రి వేళల్లో తుప్పల కారణంగా రహదారి కనిపించక పోవడం, వాహనాలకు తుప్పలు తగలడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అధికారులు స్పందించి రహదారుల చెంతన ఉన్న తుప్పలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

నిత్యం ఏదో ఒక ప్రమాదం



ఏటిగట్టు రహదారిలో తుప్పల కారణంగా నిత్యం ఏదో ఒక ప్రమాదం సంభవిస్తుంది. యానాం నుంచి రావులపాలెం వరకూ రహదారిలో నిత్యం అనేక మంది ప్రయాణిస్తూ ఉంటారు. ముఖ్యంగా దూర ప్రాంతాల నుంచి వచ్చేవారికి రహదారి పూర్తిగా తెలియకపోవడం, రాత్రి వేళల్లో మందుబాబులు వేగంగా వాహనాలు నడపడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి రహదారుల చెంతన గల తుప్పలను తొలగించాలి.

– కోరుకొండ చంటి, వైఎస్సార్ సీపీ నాయకుడు, గోవలంక

ప్రయాణమంటేనే భయమేస్తుంది



గాడిమొగ రహదారిలోనే నిత్యం పొలానికి వెళుతుంటాం. అయితే రహదారి వెంబడే తుప్పలు పెరిగిపోవడంతో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. అందుకే ఈ దారిలో ప్రయాణించాలంటేనే భయమేస్తుంది. అధికారులు స్పందించి తుప్పలను తొలగించాలి.

– వి.భగవాన్, రైతు, పి.మల్లవరం

కార్పెంటర్ల జీవనోపాధిని దెబ్బతీసే చర్యలను అరికట్టాలి



సీనియర్ అసిస్టెంట్ జగితా బేగంకు వినతి పత్రాన్ని అందజేస్తున్న సూర్యనారాయణమూర్తి తదితరులు

అమలాపురం టౌన్: కార్పెంటర్ల జీవనోపాధిని దెబ్బతీసే చర్యలను అరికట్టాలని జిల్లా చేతి వృత్తుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు, వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి అన్నారు. వేప కర్రలతో రెడీమేడ్ కిటికీలు, గుమ్మాలు తయారుచేసి టింబర్ డిపోల్లో అమ్మడం వల్ల చేతివృత్తిదారులకు ముఖ్యంగా కార్పెంటర్లకు జీవనోపాధి దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యలను అటవీశాఖ అధికారులు అడ్డుకోవాలని కోరుతూ అమలాపురంలోని జిల్లా అటవీ శాఖ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ జగితా బేగంకు చేతివృత్తులదారుల సంఘం ప్రతినిధులు వినతి పత్రాన్ని బుధవారం అందించారు. కార్యక్రమంలో జిల్లా చేతివృత్తుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి గున్నేపల్లి భీమశంకరం, కొనుకు వెంకటేశ్వరరావు, కేతా సోమేశ్వరరావు, కొవ్వూరి శ్రీనివాసరావు, యార్లగడ్డ అరుణకుమార్, కొప్పిశెట్టి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బహుళ వైకల్యాన్ని గుర్తించాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎస్‌వి నాయుడు

యానాం: బహుళ వైకల్యంతో బాధపడుతున్న వారిని గుర్తించి వారికి ఇంటి వద్దే ఉచితంగా పౌష్టికాహారాన్ని అందిస్తున్నట్లు మల్టీడిజిబుల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎస్‌వి నాయుడు పేర్కొన్నారు. బుధవారం స్థానిక రాజీవ్ బీచ్‌లో ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ కార్యాలయంలో మల్టీ డిజిబిలిటీ ప్రాజెక్టులో భాగంగా ఆశ, అంగన్‌వాడీ సిబ్బందికి బహుళ వైకల్యంతో బాధపడుతున్న వ్యక్తులను ఏ విధంగా గుర్తించాలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాజెక్టులో భాగంగా బహుళ వైకల్యంతో బాధపడుతున్న వారిని గుర్తించి వారికి ఉచితంగా ఫిజియోథెరపీ, న్యూట్రిషన్ ఫుడ్, ఓకేషనల్ యాక్టివిటీస్ ఉచితంగా అందిస్తున్నామన్నారు. కావున బహుళవైకల్యం గల పిల్లలుంటే వారిని గుర్తించి తమకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ ఫ్యాకల్టీ రాంజీ అంబేడ్కర్, స్వాతి, సంపత్, గీత, విజయదుర్గ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ రాజుకు సత్కారం



మున్సిపల్ కమిషనర్ రాజును సత్కరిస్తున్న పారిశుధ్య కార్మికులు

అమలాపురం టౌన్: ఇటీవల మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన కేవీఆర్ఆర్ రాజును స్థానిక మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో బుధవారం తెల్లవారుజామున పారిశుధ్య కార్మికులు ఘనంగా సత్కరించారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) జిల్లా, ప్రాంతీయ శాఖల నాయకులు, కార్మికుల ఆధ్వర్యంలో ఈ సత్కార కార్యక్రమం జరిగింది. కార్మిక సంఘాల తరపున, పారిశుధ్యం పరంగా మున్సిపాలిటీకి తామంతా పూర్తి సహకారం అందిస్తామని యూనియన్ నాయకులు కె.సత్తిబాబు, కొప్పుల కృష్ణ, మల్లారపు సత్యనారాయణ, నిమ్మకాయల శ్రీనివాసరావు తదితరులు కమిషనర్ రాజుకు స్పష్టం చేశారు. కార్యక్రమంలో కానేటి వెంకట్రావు, మెండు చిన్న, దంగేటి శ్రీను, పోతుల రాజేష్, గొట్టాపు రమణి, నిమ్మకాయల సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

రోగులకు ప్రేమపూర్వకంగా వైద్యసేవలందించాలి



ఫార్మసిస్ట్ డే సందర్భంగా న్యూస్‌లెటర్‌ను ఆవిష్కరిస్తున్న కళాశాల ప్రతినిధులు

తాళ్లరేవు: వైద్యరంగంలోకి ప్రవేశిస్తున్న ఫార్మసిస్టులు రోగులకు ప్రేమపూర్వకంగా వైద్యసేవలు అందించాలని ప్రముఖ కిమ్స్ ఆస్పత్రి వైద్యుడు చిట్టూరి అశోక్‌కుమార్ తెలిపారు. బుధవారం కోరంగిలోని కోరింగా ఫార్మసీ కళాశాలలో ప్రిన్సిపాల్ సువర్ణజ్యోతి అధ్యక్షతన జరిగిన వరల్డ్ ఫార్మసిస్టు డే వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమాజ సేవ చేసేందుకు ఫార్మారంగం ఎంతగానో దోహదపడుతుందన్నారు. మన దేశంలో జనరిక్ మందులు వినియోగించాల్సిన ఆవశ్యకతను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం న్యూస్ లెటర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైద్యుడు అశోక్‌కుమార్‌తో పాటు ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్‌లు చిట్టూరి కలికిమూర్తి, ర్యాలి సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ కె.గోవిందరావు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కె.మాల తదితరులు పాల్గొన్నారు.

అయినాపురంలో పొలం పిలుస్తోంది



అయినాపురంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రశాంత్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ సత్యనారాయణ

ముమ్మిడివరం: మండల పరిధిలోని అయినాపురం గ్రామంలో సర్పంచ్ మోకా రామారావు అధ్యక్షతన పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి ఎస్.ప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ రైతు ముంగిటకు వ్యవసాయ, అనుబంధశాఖల సేవలు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆధునిక వ్యవసాయ, శాస్త్రీయ పరిజ్ఞానాన్ని, పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బొంతు నాగరాజు, ఇందుకూరి పాండురంగరాజు, మట్టా సత్తిబాబు, వెటర్నరీ డాక్టర్ జగదీష్, ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనర్ ఏడుకొండలు, రైతులు పాల్గొన్నారు.

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు

అల్లవరం: వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు పొలం పిలుస్తోంది కార్యక్రమం ద్వారా రైతులకు శాస్త్ర సాంకేతికపరమైన సలహాలు, సూచనలు అందిస్తున్నామని వ్యవసాయాధికారి ఎన్‌వీవీ సత్యనారాయణ అన్నారు. సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి అధ్యక్షతన బోడసకుర్రు సచివాలయం వద్ద బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులకు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి నారాయణరావు, కార్యదర్శి దుర్గా శ్రీనివాస్, అడపా వెంకటేశ్వరరావు, ముత్యాల బాబి, దొమ్మేటి రాజు తదితరులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూముల వివరాలను అప్‌లోడ్ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: డీపట్టాలు జారీ చేసి 20 ఏళ్లు దాటిన అసైన్డ్ భూముల వివరాలను వెబ్‌ల్యాండ్‌లో కనిపించేలా అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి, ఆర్డీవోలు, రెవెన్యూ ఉద్యోగులతో సమావేశం నిర్వహించి అసైన్డ్ భూములు, నిషేధిత 22ఏ భూములు, విలేజ్ సర్వీస్ ఈనామ్ భూముల గురించి డివిజన్ల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మహేష్‌కుమార్ మాట్లాడుతూ ఇప్పటికే ఈ భూముల వివరాలను రాష్ట్ర ఉన్నతాధికారులు కోరారన్నారు. క్షేత్రస్థాయిలో భౌతికంగా విచారించి పూర్తి వివరాలను వెబ్‌ల్యాండ్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. 20 ఏళ్లు పైబడిన అసైన్డ్ భూముల్లో భూమి పొందినవారు, వారి వారసులు ఉన్నారా లేదంటే థర్డ్ పార్టీవారు అనుభవదారులుగా ఉన్నారా అన్న వివరాలు సేకరించాలన్నారు. కార్యక్రమంలో జేసీ టి.నిషాంతి, డీఆర్‌ఓ ఎం.వెంకటేశ్వర్లు, ఆర్డీవోలు జె.కేశవ వర్ధనరెడ్డి, జీవీవీ సత్యనారాయణ, రెవెన్యూ ఉద్యోగులు తేజేశ్వరరావు, చినబాబు తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురం ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా కూటమి ధర్నా



మామిడికుదురులో ధర్నా చేస్తున్న కూటమి నేతలు

మామిడికుదురు: పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పకు వ్యతిరేకంగా కూటమి నేతలు బుధవారం మామిడికుదురులో ధర్నా చేశారు. మగటపల్లిలో వైఎస్సార్ సీపీ నేతలకు రాజప్ప కొమ్ము కాస్తున్నారని ఆరోపిస్తూ మండల రెవెన్యూ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. రాజప్ప రాజీనామా చేయాలని కూటమి నేతలు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. ప్రభుత్వ భూమిలో 30 ఏళ్ల నుంచి బడ్డీ పెట్టుకుని ఉపాధి పొందుతున్న కూటమి వ్యక్తికి వ్యతిరేకంగా రాజప్ప వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడికి రాజప్ప వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. ధర్నా అనంతరం మండల రెవెన్యూ కార్యాలయంలో వినతి పత్రం ఇచ్చారు. ధర్నాలో నామన రాజనర్సింహరావు, గోగి గోపాలకృష్ణ, నామన నాగేశ్వరరావు, బొంతు మణిరాజు, యాలంగి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

అప్పనరామునిలంకలో స్వచ్ఛతాహి సేవ



అప్పనరామునిలంక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మొక్క నాటిన సర్పంచ్ సుబ్బరాజు

సఖినేటిపల్లి: అప్పనరామునిలంక జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం రామరాజులంక చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో సర్పంచ్ ఇందుకూరి సుబ్బరాజు, ఎంపీపీ వీరా మల్లిబాబు మొక్కలను నాటారు. పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ దొంగ నాగలక్ష్మి, బ్యాంకు బ్రాంచి మేనేజర్ శివరామిరెడ్డి, బ్యాంకు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

మండల స్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



అప్పనరామునిలంకలో ప్రతిభ చూపిన విద్యార్థులతో టీచర్స్, ప్రజాప్రతినిధులు

సఖినేటిపల్లి: అప్పనరామునిలంక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు 17 మంది కబడ్డీ, చెస్, బ్యాడ్మింటన్, వాలీబాల్ పోటీల్లో గెలుపొంది, నియోజకవర్గ పోటీలకు అర్హత సాధించారు. ఎస్‌జీఎఫ్ఐ మండల స్థాయి గేమ్స్ పోటీల్లో వీరంతా గెలిచినట్టు బుధవారం హెచ్ఎం జేవైకే సత్యనారాయణ అన్నారు. అలాగే నియోజకవర్గ స్థాయిలో బ్యాడ్మింటన్, వాలీబాల్ పోటీల్లో ఏడుగురు విద్యార్థులు జిల్లా స్థాయికి అర్హత సాధించారన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ఎంపీపీ వీరా మల్లిబాబు, సర్పంచ్ ఇందుకూరి సుబ్బరాజు, ఎస్ఎంసీ చైర్మన్ దొంగ నాగలక్ష్మి అభినందించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



బి.దొడ్డవరంలో బైక్‌ను ఢీకొట్టిన ట్రాక్టర్

మామిడికుదురు: మోటార్ సైకిల్‌ను ట్రాక్టర్ ఢీ కొట్టిన సంఘటనలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. బి.దొడ్డవరం బొలిశెట్టివారి పాలెం వంగవీటి మోహనరంగా విగ్రహం ఎదుట బుధవారం ఈ ప్రమాదం జరిగింది. అప్పనపల్లి వైపు వెళ్తున్న బైకును ఎదురుగా బి.దొడ్డవరం వస్తున్న ట్రాక్టర్ ఢీ కొట్టింది. ట్రాక్టర్ బైక్‌ను ఢీ కొట్టి, రోడ్డు పక్కన ఉన్న ప్రహరీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ చక్రం విరిగిపోగా, బైక్‌తో పాటు ప్రహరీ ధ్వంసమయ్యాయి. బైక్‌పై వెళ్తున్న కటికిరెడ్డి ప్రసాద్, అతని కుమారుడు సాయి గాయపడ్డారు. గాయపడిన ఇద్దరిని స్థానికులు అమలాపురం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. బైక్‌పై ప్రయాణిస్తున్న వారు గాయాలతో బయట పడడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. త్రుటిలో ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

గురువు ఆశీస్సులు తీసుకున్న కేంద్రమంత్రి



తన గురువు సబితతో కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్

యానాం: కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తనకు విద్యాబుద్ధులు నేర్పిన చిన్ననాటి స్కూల్ టీచర్ ఆశీస్సులను తీసుకున్నారు. బుధవారం పుదుచ్చేరిలో భారత్ శక్తి పండిట్ లిటరరీ ఫెస్టివల్-2024 ముగింపు సందర్భంగా అరబిందో సొసైటీలో జరిగిన కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా అక్కడే ఉన్న టీచర్ సబిత పుష్పగుచ్ఛంతో నిర్మలాసీతారామన్‌ను ఆహ్వానించారు. ఈ క్రమంలో ఆమె టీచర్ సబిత పాదాలను తాకి ఆశీస్సులను తీసుకున్నారు. నిర్మలా సీతారామన్ హోలీక్రాస్ బాలికల హైస్కూల్, తిరుచ్చిలో చదువుకుంటుండగా సబిత ఆమెకు పాఠాలు బోధించారు. పదవీ విరమణ తరువాత సబిత అరబిందో ఆశ్రమంలో ఉంటున్నారు.

మాజీ ఎంపీ హర్షకుమార్ పరామర్శ



చల్లపల్లిలో గెడ్డం లక్ష్మణరావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న హర్షకుమార్ తదితరులు

ఉప్పలగుప్తం: మండలంలోని చల్లపల్లి పంచాయతీ పరిధి జగ్గరాజుపేటకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు గెడ్డం లక్ష్మణరావు తండ్రి భూషణం ఇటీవల మృతి చెందారు. ఆ కుటుంబాన్ని బుధవారం అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ పరామర్శించారు. భూషణం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పరామర్శించిన వారిలో జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు, ఎంపీటీసీ సభ్యుడు కొంకి ఏడుకొండలు, ఇసుకపట్ల రఘుబాబు, గెడ్డం సురేష్‌బాబు, కుసుమే వెంకన్న, బడుగు శ్రీనివాసరావు, ముడిదుడ్డి సత్యనారాయణ, బండి శ్రీరాములు, బుడితి శ్రీను, హరిదాసు తదితరులున్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తాళ్లరేవు: ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని తాళ్లరేవు, కాజులూరు మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ సహాయకురాలు పోస్టులకు సంబంధించి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ వంజరాన మాధవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాళ్లరేవు మండలంలోని ఉప్పంగల, కాజులూరు మండలంలో పెనుమల్ల, వనమువారి ఎస్సీపేట, పల్లిపాలెం -1 కేంద్రాలకు సంబంధించి వచ్చే నెల 5వ తేదీలోగా దరఖాస్తులను అందజేయాలన్నారు.

సీతారాం ఏచూరికి ఘన నివాళి



సీతారాం ఏచూరి సంస్మరణ సభలో మాట్లాడుతున్న శ్రీనివాస్

తాళ్లరేవు: ఉత్తమ పార్లమెంటేరియన్, కార్మిక ఉద్యమ నాయకుడు సీతారాం ఏచూరికి ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. బుధవారం స్థానిక సంఘ భవనంలో వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు టేకుమూడి ఈశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఏచూరి సంస్మరణ కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా కార్యదర్శి కేఎస్ శ్రీనివాస్ మాట్లాడుతూ పీడిత ప్రజల పక్షాన పార్లమెంట్‌లో పోరాడిన యోధుడు సీతారాం ఏచూరి అని కొనియాడారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు, కాకినాడ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఉంగరాల వెంకటేశ్వరరావు, అత్తిలి బాబూరావు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

జిల్లా జట్టుకు క్రీడాకారుల ఎంపిక

సఖినేటిపల్లి: అంతర్వేదికర జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు క్రీడాకారులు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ గేమ్స్‌లో ప్రతిభ చూపారని హెచ్ఎం పి.సోమ సూర్యకుమారి బుధవారం తెలిపారు. అండర్-14 లో కబడ్డీ విభాగంలో ఇద్దరు, ఖోఖో విభాగంలో ఒకరు, వాలీబాల్ విభాగంలో ముగ్గురు, వాలీబాల్ అండర్-17లో ముగ్గురు ఎంపికైనట్టు పీడీ కె.భాస్కరరావు అన్నారు. ఎంపికైన విద్యార్థులను సర్పంచ్ పోతురాజు నరసింహరావు, అభివృద్ధి కమిటీ చైర్మన్ పోతురాజు నాగేంద్రకుమార్, ఎస్ఎంసీ చైర్మన్ ఎ.శ్రీరాములు అభినందనలు తెలిపారు.